
# ఈ కథ కల్పితం కాదు!

డాక్టర్ ఎం. సుగుణరావు




**"బాబూ!** నిజం చెప్పాలి, ఎప్పుడూను. 'సత్యాన్న ప్రమదితవ్యమ్, ధర్మాన్న ప్రమదితవ్యమ్'. సత్యం చెప్పాల్సి వచ్చినప్పుడు, ధర్మం ఆచరించవలసి వచ్చినప్పుడు వెనుకా, ముందూ ఆడకు. నిలబడు. నిలబడతావా?"

నా ముందుకొచ్చిన ఆగంతకుడు అలా ప్రశ్నించేసరికి షాక్ తిన్నాను. అతను సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. జుట్టు నెరిసి ఉంది. అద్దాలు లేని కళ్లజోడు, భుజంమీది కండువా, మాసిపోయిన పంచె, చేతిలో కర్ర, భుజాన సంచీ.

'ఇదేమిటీ, ఇతడికి పిచ్చా, వెర్రా?' అనుకున్నాను.

నా భుజాలు కుదుపుతూ, కళ్లల్లోకి సూటిగా చూస్తూ అదే ప్రశ్న మళ్లీ వేశాడు.

బస్టాండ్‌లో బస్సుకోసం చూస్తున్నాను. నేను ఆ ఊరికి కొత్త. బదిలీ అయి వచ్చి వారం రోజులు కాలేదు. మిగతా ప్రయాణీకులు మా ఇద్దర్నీ వింతగా చూస్తున్నారు.

అంతమందిలో నే నొక్కడినే దొరికానా ఈ పిచ్చోడికి అనుకుంటూ అక్కణ్ణుంచి కదిలాను, అతణ్ణి వదిలించుకుందామని, అయినా నన్ను వదల్లేదు. వెంటపడ్డాడు. ఇంతలో ఆపద్బాంధవుడిలా ఒక ముసలాయన వచ్చి నిలుచున్నాడు నా పక్కనే. నేను నిస్సహాయంగా ఆయనవంక చూశాను.

ఆయన నా చెవిలో గొణిగాడు, "ప్రాణం పోయినా సరే, నిజం చెపుతానని చెప్పేయ్యండి! అలా అంటే వెళ్లిపోతాడు!" అన్నాడు.

నేను వెంటనే ఆ మాటలు చెప్పాను గబగబా. అంతే, ఆ పిచ్చిమనిషి మంత్రం వేసినట్టుగా రెండు చేతులూ జోడించి నాకు నమస్కారం పెట్టి అక్కణ్ణుంచి వేగంగా కదిలాడు.

నేను ఆ ముసలాయన వంక కృతజ్ఞతగా చూసి, "థ్యాంక్స్ మాస్టారూ! రక్షించారు. మీరు లేకపోతే ఆయన నన్ను తినేసేవాడు. ఇంతకూ

అతను పిచ్చాడేనా?" అన్నాను ఆయనతో. ఆయన మౌనంగా అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు, నాలో ప్రశ్నార్థకం మిగిల్చి.

నేను బెంచీమీద కూలబడి ఊపిరి పీల్చుకున్నాను. ఆ పిచ్చిమనిషి మిగిల్చిన అలజడి నాలో ఇంకా తగ్గలేదు. బస్సు ఒక గంట లేటట. ఎక్కడో ట్రాఫిక్ జామ్. సిగరెట్టు వెలిగించి టైమ్ ఎలా గడపాలా అని ఆలోచిస్తూ ఉండిపోయాను.

నాకు సలహా చెప్పిన పెద్దమనిషి వచ్చి నా పక్కనే కూర్చున్నాడు.

"ఏ ఊరు బాబూ మీరు వెళ్లేది?" అన్నాడు.

చెప్పాను. "నేనూ అదే ఊరు వెళ్తున్నాను!" అన్నాడు.

నాలోని కథకుడు నన్ను తట్టి లేపాడు. ఈ పెద్దాయనను కదిపితే నన్ను విసిగించిన పిచ్చిమనిషి వృత్తాంతం తెలుస్తుంది. ఒక కథకు ఇతివృత్తం దొరుకుతుందేమో అనుకున్నాను.

"అయ్యా! నన్ను ఇందాక విసిగించిన వ్యక్తి మీకు తెలుసా?" అన్నాను ఆయన్ని.

"తెలియకేం, అతడి జీవితంలో ప్రతి ఘట్టమూ నాకు తెలుసు. అతనిది మా ఊరే. అతడి తల్లి నాకు దూరపు బంధువు!" అన్నాడు.

"మరయితే మిమ్మల్ని చూసి కూడా...!" నా ప్రశ్న పూర్తి కాకుండానే, "అతడి పేరు దేవుడు. మన లోకంలో లేడు, బాబూ!" అన్నాడాయన బాధగా.


"అయితే దేవుడికి ఎలా పిచ్చెక్కింది?" అన్నాను.

"ఎందుకులెండి... అది తలుచుకుంటే మనసు నీరవుతుంది. జరిగిపోయినవాటిని ఇప్పుడు తవ్వకోవటం ఎందుకు?" ఆయన ముక్తసరిగా చెప్పి మౌనం వహించాడు.

నేను కొంచెం వెనక్కు తగ్గాను, ఆయనకిష్టం లేని పని గురించి పదే పదే అడగడం ఎందుకూ అని. అయినా నాలోని కథకుడు ఆగేట్టు లేడు. క్షణంసేపు మౌనం వహించి మళ్లీ ఆయనవంక తిరిగి అన్నాను

"ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కన్పించని కథలేగా కావాలిప్పుడు, 'దాచేస్తే దాగని సత్యం!' అన్నారు శ్రీశ్రీగారు. అంచేత దేవుడు కథ మీరు చెప్పాలి, నేను దాన్ని తిరిగి రాయాలి!"

...అంతమందిలో నే నొక్కడినే దొరికానా ఈ పిచ్చోడికి అనుకుంటూ అక్కణ్ణుంచి కదిలాను, అతణ్ణి వదిలించుకుందామని, అయినా నన్ను వదల్లేదు. వెంటపడ్డాడు. ఇంతలో ఆపద్బాంధవుడిలా ఒక ముసలాయన వచ్చి నిలుచున్నాడు నా పక్కనే. నేను నిస్సహాయంగా ఆయనవంక చూశాను.



అన్నాను.

"అలాగే, మీరు రాస్తానంటే చెపుతాను!" అంటూ ఆయన కళ్లు మూసుకున్నారు.

బహుశా గతంలోకి జారుకున్నారేమో, జరిగిపోయిన సంఘటనలను వరుసక్రమంలో పేర్చుతున్నారు కాబోలు, మౌనంగా ఉండిపోయారు. ఆయన రెండు నిమిషాలు ధ్యానముద్రలోంచి బయటకొచ్చి అన్నారు "దేవుడు గాంధీగారు స్వర్గస్థులైన రోజే పుట్టాడు."

"అంటే 1948, జనవరి ముప్పై. ఇప్పటికి యాభైయ్యేళ్లు. అంటే ఆ పిచ్చిమనిషి వయసు యాభైఏళ్లన్నమాట. అయితే చూట్టానికి డెబ్భైయ్యేళ్లవాడిలా ఉన్నాడు!" అన్నాను.

ఆయన నావంక అదోలా చూశారు. ముఖంలో కొద్దిగా కోపం ...

నాకు వెంటనే అర్థమైంది. దేవుణ్ణి పిచ్చివాడు అని పదే పదే అనడం ఆయనకు బాధ కలిగిస్తోందని. అందుకే వెంటనే అన్నాను "క్షమించాలి... దేవుడు దేవుడిలాంటి మనిషే అయి అతడు సార్థక నామధేయుడే అయి ఉండాలి!"

"ఔను, బాబూ! దేవుడు అనే పేరు అతడికి ఎందుకు పెట్టారో గానీ, అతడికి ఆ పేరుతోనే కష్టాలు ప్రారంభమైనాయి."

"అంటే...?" నాకు అర్థం కాక ఆయన్ను మళ్లీ ప్రశ్నించాను.

"నువ్వు దేవుడు అనే పేరు పెట్టుకున్నావు. గాంధీగారు చనిపోయిన రోజు పుట్టావు. అంచేత నువ్వు దేవుడి లక్షణాలు కలిగి ఉండాలి. గాంధీగార్లో దేవుడున్నాడు, ఆయన నిజంకోసం బతికారు. ... ఇలా స్కూల్లో మాస్టర్లు నిరంతరం బోధించడంతో ఆ మాటలు దేవుడిలో బలంగా నాటుకున్నాయి.


"ఒక చెంపమీద కొడితే మరో చెంప చూపించేవాడు. అందరూ అతన్ని కొట్టి ఏడిపించేవాళ్లు."

"మై గాడ్! నిజంగా అలాంటి వ్యక్తులు అరుదుగా కనిపిస్తారు!" అన్నాను.

"ఔను. కోటికి ఒకరు!" అంటూ ఆయన చెప్పడం కొనసాగించారు.

"తల్లి చనిపోయేవరకూ మహరాజులా గడిచింది బతుకు. స్కూలు ఫైనలు వరకూ చదివించింది. ఆమె పోవడంతో బతుకు రోడ్డుమీదకొచ్చింది. తను గాంధీని అనుకునేవాడు. ఊళ్లో తగవులు తీర్చేవాడు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండేవాడు. రాత్రిపూట పిల్లల్ని కూర్చోబెట్టి చదివించేవాడు. దేవుడు పనికిరాకుండా పోతున్నాడని అతడి అన్నయ్య ఒక షావుకారు దుకాణంలో పద్దులు రాసే పనిలో పెట్టాడు...."

"అక్కడేనా దేవుడికి ఈ విధంగా అయింది



పాపం....?" ఉండబట్టలేక అడ్డొచ్చాను ఆయనకు.

నా మాటలకు విసుక్కోకుండా ఆయన కొనసాగించాడు.

"దేవుడు పనిచేసే షాపు యజమాని బియ్యంలో రాళ్లు కలుపుతాడు, కారంలో తౌడు పోసి కల్తీ చేస్తారు. అది తప్పు అనేవాడు అతడి ముఖంమీదే. మూడోరోజే షావుకారు దేవుడిని బయటకు పంపాడు. మళ్లీ అతడి అన్న ఒక మిల్లులో పనికి కుదిర్చాడు. అక్కడా వారి పద్ధతి నచ్చక బయటకొచ్చేశాడు. నీ ఖర్మ అని వదిలేశాడు అతడి అన్నయ్య."

ఆయన చెప్పడం ఆపి ఊపిరి పీల్చుకున్నారు.

"తర్వాతేమైంది?" అన్నాను ఉత్సుకతతో.

"ఒక సంఘటన జరిగింది. అది జరక్కపోతే దేవుడు నిక్షేపంలా మన లోకంలోనే ఉండేవాడు!" అన్నాడాయన నిర్లిప్తంగా.

"ఏమిటా సంఘటన?" అన్నాను.

ఆయన గతంలోకి జారిపోయి కళ్లు మూసుకున్నారు. రెండు నిమిషాల తర్వాత తిరిగి చెప్పడం ప్రారంభించారు.

"మా ఊరికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌనులో ప్రతి సంవత్సరం ఎగ్జిబిషను జరుగుతుంది. రంగుల రాట్నాలు, జెయింట్ వీల్, సర్కస్ ... వీటితోపాటు రకరకాల దుకాణాలు వెలుస్తాయి. ప్రతిసారీ ఒకాయన గాంధీగారిలా వేషం వేసుకుని, ఒంటినిండా రంగు పూసుకుని ఎగ్జిబిషనులో గాంధీబొమ్మలా నిలబడేవాడు.

"ప్రతి సంవత్సరం ఆ సజీవ గాంధీబొమ్మ తప్పకుండా ఉండాల్సిందే! ఎగ్జిబిషనులో అదో పెద్ద ఆకర్షణ. అయితే ఒక సంవత్సరం ఆ బొమ్మలా నిల్చునే వ్యక్తి రాకపోయేసరికి ఆ ఎగ్జిబిషను నిర్వాహకులు మన దేవుడిని సంప్రదించారు. ఎందుకంటే ..."

ఆయన చెప్పకముందే నేనన్నాను "బహుశా తన మంచితనంవల్ల, ఆదర్శాలవల్ల దేవుడికి గాంధీగారనే పేరు వచ్చి ఉంటుంది. అంతేనంటారా? అందుకేనా దేవుణ్ణే వారు పిలిచింది?"


"ఔను. దేవుడిని అంతా గాంధీ అనే పిలిచేవారు. అందరి నోళ్లల్లోనూ గాంధీ పేరే నలిగేది. అతడి పేరు అందరూ మర్చిపోయారు. ఆ ఎగ్జిబిషన్‌లో గాంధీబొమ్మలా నిలుచోవటానికి ఆనందంగా ఒప్పుకున్నాడు. మధ్యమధ్యలో ప్రజల్లోకి వచ్చి గాంధీసూక్తులు వల్లించేవాడు. గాంధీగారిలా శ్లోకాలు చదివేవాడు... ఎక్కువసేపు బొమ్మలా నిల్చునేవాడు. కాళ్లు నొప్పులు పెడుతున్నా అలా శిలా ప్రతిమలా ఉండిపోయేవాడు. ఎగ్జిబిషన్ ముగిసే మూడోరోజు, ఇక తను గాంధీ వేషం చాలించి, ఇంటికి వెళ్తాడనగా జరిగింది ఆ దుర్ఘటన ..."

ఆయన మళ్లీ భారంగా కళ్లు మూసుకున్నాడు, చెప్పడం ఆపి.

"ఏమైందండీ?" అన్నాను ఆత్రుతగా.

ఒకసారి కళ్లు రుద్దుకుని మళ్లీ చెప్పడం మొదలుపెట్టారు.

"ఆ ఎగ్జిబిషనులో ఒక పుస్తకాల షాపు పెట్టారు. దానిని ఒక అమ్మాయి నడిపేది. జనం పలచబడడంతో ఆ అమ్మాయి దుకాణం మూసి ఇంటికి బయలుదేరింది. ఆ రోజు ఆమె దురదృష్టం కొద్దీ ఆమె వాళ్లెవరూ తోడు లేరు. ఎగ్జిబిషను దాటి రిక్షా ఎక్కబోయింది, అప్పుడొచ్చారట నలుగురు వ్యక్తులు. అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా తిరిగినప్పుడే స్వాతంత్ర్యం అన్న గాంధీగారి అడుగుజాడల్లో నడిచే దేవుడు తను నిల్చున్న చోటునుంచి వాళ్ల దగ్గరకు పరుగెత్తుకు వచ్చేసరికి ఆ అమ్మాయిని బలవంతంగా కారులో తీసుకుపోయిన రాక్షసులు అమానుషంగా ... ఆయన మరి చెప్పలేకపోయాడు.




ఇంతలో బస్సు వచ్చింది. గబగబా బస్సెక్కాను. నన్ను ఆయన అనుసరించాడు.

000 000 000

బస్సు స్పీడుగా వెళ్తోంది. నా ఆలోచనలు అంతకన్నా వేగంగా ప్రయాణిస్తున్నాయి. దేవుడి కథ కళ్లకు కట్టినట్లు చెప్పిన ముసలాయన బస్సు కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. ఆయన ముఖంలోకి నేను చూస్తున్నాను. ఆయన దేవుడి మిగతా కథ చెపుతాడా, లేదా అనేది నా భయం. రెండు మూడుసార్లు నేను ఆయన్ని మాట్లాడించబోయినా మౌనం వహించాడు. బస్సు ఇంకో అరగంటలో మమ్మల్ని గమ్యస్థానం చేరుతుందనగా ఆయనే నోరు విప్పాడు.

"చూశారా... మనం ఈ కిటికీలోంచి బయటకు చూస్తుంటే రోడ్డువక్కనున్న చెట్లు, చేమా, స్తంభాలూ కదిలిపోతున్నట్టుగా భ్రమ కలుగుతోంది. వాస్తవానికి కదిలిపోయేది బస్సు. అలాగే దేవుడికి కాదు పిచ్చివట్టింది, దేవుడు మంచివాడే. మనమే పిచ్చివాళ్లమై దేవుడి మంచితనాన్ని గుర్తించలేకపోతున్నాము. దేవుడు పిచ్చివాడని భ్రమపడుతున్నాము!"

ఆయన మాటలతో నేను ఏకీభవించాను. ఆయన దేవుడి మిగతా కథ చెప్పడం ప్రారంభించాడు.

"ఆ ఎగ్జిబిషనులో ఆ బుక్‌షాపు అమ్మాయిని ఎత్తుకెళ్లి పాడుచేసిన నలుగురు కుర్రాళ్లు రాజకీయ ప్రముఖుల పుత్రరత్నాలు. తను చూసిన విషయాన్ని ఆ రోజు రాత్రే దేవుడు పోలీస్ స్టేషనులో చెపితే, ఇన్‌స్పెక్టర్ రిపోర్టు తీసుకోలేదు సరికదా, ఇంకెక్కడా చెప్పొద్దని బెదిరించాడు. దాంతో దేవుడు పేపరులో స్టేట్‌మెంట్ ఇచ్చాడు. ఆ అమ్మాయి తల్లితండ్రులూ కేసు పెట్టలేదు నలుగురిలోనూ నవ్వులపాలవుతామని."

"అయ్యో... దేవుడికి ఎవరూ అండగా నిలబడలేదన్నమాట, అతడు న్యాయంకోసం పోరాడుతున్నా!" నేను ఆ మాట అనగానే, ఆయన నిట్టూర్పు విడిచి...

"దేవుడు పిచ్చెక్కి మాట్లాడుతున్నాడని పిచ్చాసుపత్రిలో పెట్టించారు. అతడికి బలవంతంగా కరెంటు ఎక్కించి నెల తర్వాత పిచ్చాసుపత్రి నుంచి బయటకు పంపారు!

"దేవుడు రోడ్డుమీద నడుస్తుంటే అందరూ అతడిని పిచ్చివాడుగా చూడడం, పిల్లలు రాళ్లతో కొట్టడం, ఈలోగా అందరికీ ఆ అమ్మాయి విషయం తెలిసిందని, ఆమె ఆత్మహత్య చేసుకోవడం... ఈ నేపథ్యంలో నిక్షేపంలాంటి దేవుడికి నిజంగానే మతి భ్రమించింది. ఐదేళ్లనుంచీ అలా మతిలేనివాడిలా తిరుగుతూ ఎవరైనా కొత్త

ముఖాలు కనిపిస్తే నిజం చెప్పమని బలవంతం చేస్తాడు!"

దేవుడి విషాదగాథను ఆయన చెప్పలేక చెపుతుంటే నా మనసు ద్రవించింది.

'ఔను, నిజమే! ఈ జనారణ్యంలో దేవుడు బతకలేడు. ఈ మనుషుల మధ్యకొస్తే దేవుడికి నిజంగానే పిచ్చి పడుతుంది!' అనుకున్నాను.

***

వారం తర్వాత దేవుడి జీవితం గురించి నేను విన్న విషయాల ఆధారంగా కథ రాశాను. రాసిన తర్వాత కథ పంపే అలవాటు లేదు. ఎవరైనా సాహితీ మిత్రుడికి చూపించడం తప్పనిసరి.




మా ఆఫీసులో నా కొలీగ్ భానుమూర్తికి చూపించాను. అతను చదివి, "కథ బావుంది. దుర్మార్గుల దౌర్జన్యానికి రెండు జీవితాలు బలయినాయి. అందులో ఒకరు ఈ లోకంలో లేరు, మరొకరు ఈ లోకంలో ఉన్నా మనుషుల్లో లేరు. ఆ ఇద్దరి పతనానికీ కారణమైనవాళ్లు మాత్రం పెద్ద మనుషులుగా చలామణీ అవుతూ ఈ ఊళ్లోనే ఉన్నారు. వారి గురించి కథ రాసినందుకు కొంపదీసి నీ క్కూడా పిచ్చెక్కించరు కదా!?"

ఆ మాటలు అతను సరదాగా అన్నాడో, సీరియస్‌గా అన్నాడో నాకు మాత్రం ఏదో భయంలాంటి భావన.. అసలే ఈ ఊరికి కొత్త, కథ రాసి లేనిపోని ఇబ్బందుల్ని తెచ్చుకోవడం లేదు కదా అనుకున్నాను. అంతే, అలా అనుకున్న తక్షణం రాసిన కథ మూలపడేశాను.

***

రెండు రోజుల తర్వాత దేవుడు నాకు బజార్లో కనిపించాడు. ఎవరివో భుజాలు కుదుపుతూ ప్రశ్నిస్తున్నాడు 'నిజం చెపుతారా, లేదా?' అని.

నన్నెక్కడ పట్టుకుంటాడో అని అక్కణ్ణుంచి వేగంగా కదిలి ఇంటికొచ్చేశాను.

దేవుడి గురించిన ఆలోచనలకు స్వస్తి చెప్పడానికి ఆ రోజు పేపరు తీసి చదవడం ప్రారంభించాను.

'గాంగ్ రేప్‌కు గురయిన యువతి ఆత్మహత్య!' ఆ వార్త చదవగానే నా మెదడు మొద్దుబారింది. పేపరు పేజీ తిప్పాను. 'పెళ్లయిన మహిళపై అత్యాచారం, దుండగుడి పరారీ!'

మై గాడ్! ఎన్నేళ్లయినా ప్రాచీన యుగం నుంచి పరమాణుయుగంకు ఎదిగినా జంతు దశను దాటిన మానవుడు తన పూర్వపు వాసనలు పోగొట్టుకోలేకపోతున్నాడు. మానవత్వం ఉన్న 'దేవుడి'లాంటి మనుషులు మాత్రం పిచ్చివాళ్లవుతున్నారు.

అంతే! దేవుడు మళ్లీ నా మనసులో ప్రత్యక్షమయ్యాడు. అతడి గురించిన ఆలోచనలు మొదలయినాయి. 'ఒక పిచ్చివాడికున్న జ్ఞానం నాకు లేదేమిటో, నిజం చెప్పడానికి నిర్భీతి ఎందుకు? రచయితగా నేను వెనుకంజ వెయ్యాలా?'

"జీవితంలో ఏదో ఒక భాగాన్ని స్పృశించేది రచన. జీవిత స్పర్శ లేని రచనలు చేసే రచయితలు రచయితలేనా?! రచయితలకంటూ ఒక బాధ్యత ఉంది!" ఈ మాటలు నావే. ఏదో సాహిత్య సమావేశంలో నేను నొక్కి వక్కాణించిన వాక్యాలు ఇవి. అయినా నేను చేస్తున్నదేమిటి?

ఇక మరి నేను ఆలోచించలేదు. దేవుడి కథ ఆ రోజే పోస్టు చేశాను. కథ చివరి మాటలు అవే ...

"ఈ కథ కల్పితం కాదు!" అని రాయడం మాత్రం మరిచిపోలేదు. ■

## ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రమే ఈ అపూర్వకానుక!

**వేదం** భారతజాతి జీవననాదం. వందేళ్లుగా మరేభాషలోనూ ఎవరూ చేయని అద్భుతాన్ని డాక్టర్ దాశరథి రంగాచార్య తెలుగులో చేశారు. ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణవేదాలను చిక్కటి సంస్కృతం నుంచి (9 సంపుటాలు) చక్కటి తెలుగులోనికి అనువదించారు. వేదాలను మనదైన భాషలో హాయిగా చదువుకునే అవకాశం ఇది! ఎమెస్కో ఆర్షభారతి వీటిని రు.2,950/లకు విక్రయిస్తోంది. ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రం రు.2000/లకే అందిస్తోంది. ఈ కింది కూపన్ నింపి నగదును డీడీరూపంలో **EMESCO ARSHABHARATHI , VIJAYAWADA** పేరీట తీసి ఎమెస్కో ఆర్షభారతి, ఏలూరురోడ్, విజయవాడ-చిరునామాకు పంపితే చాలు. పోస్టల్ ఛార్జీలు కూడా భరిస్తూ రు.2000/లకే మీకు వేదాలు పంపుతారు. ఈ కూపన్‌ను ఎమెస్కో బుక్‌షాప్‌లో ఇచ్చికూడా వీటిని పొందవచ్చు.

మహత్తరమైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ ఇళ్లను మంగళకర వేదపఠనంతో శుభకరం చేసుకోండి!

ఎమెస్కో ఆర్షభారతి-ఆంధ్రప్రభ

పేరు: ------------------------------------------------

వృత్తి: ------------------------------------------------

చిరునామా: ------------------------------------------------

------------------------------------------------

డీడీ నంబరు: ------------------------------------------------